www.prajasakti.com

ప్రజాశక్తి

గురువారం 14 సెప్టెంబరు 2023

5

పశ్చిమ గోదావరి

వినాయక ఉత్సవాల్లో నిబంధనలు పాటించాలి

భీమవరం రూరల్: ఈ నెల 18వ తేదీన గణేష్ చతుర్థి ఉత్సవాల్లో భాగంగా వినాయక మండపాలు ఏర్పాటు చేసే ప్రదేశాల్లో, నిబంధనలు తప్పని సరిగా పాటించాలని మున్సిపల్ కమిషనర్ శ్యామలాదేవి బుధవారం ప్రకటన విడుదల చేశారు. వినాయక విగ్రహాలకు ప్లాస్టిక్, ప్లాస్టర్ ఆఫ్ పారిస్ ఉపయోగించరాదని తెలిపారు. విగ్రహ మండపాల వద్ద డస్ట్‌బిన్ తప్పని సరిగా ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. విగ్రహ మండపాల వద్ద ఎమర్జెన్సీ నంబర్లు 1902, 100 ఏర్పాటు చేయాలని తెలిపారు. మండపం వద్ద మందుగుండు సామగ్రి వినియోగం నిషేధమని, ఫస్ట్ ఎయిడ్ కిట్లు ఏర్పాటు చేయాలని తెలిపారు. మండపాల ఏర్పాటుకు ట్రేడ్ లైసెన్స్ పొందాలని తెలిపారు. వినాయక విగ్రహాల నిమజ్జనం సమయంలో తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. 15వ తేదీలోగా విధిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని తెలిపారు. రిజిస్ట్రేషన్ చేయని మండపాలు పండుగరోజు మాత్రమే ఏర్పాటుకు అనుమతి అని తెలిపారు.

అంగన్‌వాడీల గోడుపట్టదా..!

రిటైర్డ్ ఉద్యోగుల పరిస్థితి దారుణం

అందని బెనిఫిట్లు, వృద్ధాప్య పింఛను

ఇంటి అద్దెలు, కరెంటు బిల్లుల కోసం ఎదురుచూపులే

వేరే ప్రాజెక్టులో విలీనమైన కేంద్రాల పరిస్థితి అగమ్యగోచరం

ప్రజాశక్తి – ఏలూరు ప్రతినిధి

అంగన్‌వాడీల సమస్యలు పాలకులకుగానీ, అధికారులకుగానీ పట్టడం లేదు. దీంతో అంగన్‌వాడీల అవస్థలు వర్ణనాతీతంగా మారాయి. రెండు జిల్లాలో 3,911 అంగన్‌వాడీ కేంద్రాలుండగా, 7,352 మంది వర్కర్లు, ఆయాలు పనిచేస్తున్నారు. అన్ని పనులకు అంగన్‌వాడీ ఉద్యోగులను ఉపయోగించుకుంటున్న ప్రభుత్వం, వారి సమస్యలను మాత్రం పట్టించుకోవడం లేదు. ఉద్యోగ విరమణ పొందిన అంగన్‌వాడీ ఉద్యోగులకు బెనిఫిట్ కింద వర్కర్లకు రూ.50 వేలు, ఆయాలకు రూ.20 వేలు ప్రభుత్వం ఇవ్వాల్సి ఉంది. ఉద్యోగ విరమణ చేసిన అంగన్‌వాడీలకు ఈ సొమ్ములు సకాలంలో ఇవ్వడం లేదు. ఏలూరు జిల్లాలోనే ఈ విధంగా బెనిఫిట్స్ సొమ్ము అందాల్సిన ఉద్యోగులు వందమందికిపైగా ఉన్నట్లు చెబుతున్నారు. పశ్చిమగోదావరి జిల్లాలో ఈవిధమైన సమస్యతో ఉద్యోగులు సతమతమవుతున్నారు. అంతేకాకుండా అంగన్‌వాడీలు స్కీమ్ వర్కర్ల పరిధిలోకి వస్తారు. వైసిపి ప్రభుత్వం వచ్చాక అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులగా పేర్కొంటూ ప్రభుత్వ పథకాలను నిలిపివేసింది. దీంతో రూ.11 వేలు మాత్రమే జీతం తీసుకుంటున్న అంగన్‌వాడీలు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉద్యోగ విరమణ చేసిన ఉద్యోగులకు సైతం నష్టం కలిగించేవిధంగా ప్రభుత్వం వ్యవహరిస్తోంది. ఆ ఉద్యోగుల వివరాలను ప్రభుత్వ వెబ్‌సైట్ నుంచి తొలగించాల్సి ఉంది. కానీ ప్రభుత్వం ఈ పని సక్రమంగా చేయడం లేదు. దీంతో ఉద్యోగ విమరణ పొందిన ఉద్యోగులు వృద్ధాప్య పింఛనకు దరఖాస్తు చేసుకున్నా రావడం లేదు. ప్రభుత్వ ఉద్యోగిగా చూపిస్తుందంటూ దరఖాస్తును తిరస్కరిస్తున్నారు. ఐసిడిఎస్, డిఆర్‌డిఎ అధికారులను కలిసినా ప్రయోజనం లేకుండా పోయిందంటూ అంగన్‌వాడీలు లబోదిబోమంటున్నారు. ఈ విధంగా ఇబ్బంది పడుతున్న ఉద్యోగులు ఏలూరు జిల్లాలోనే దాదాపు 270 మందికిపైగా ఉన్నట్లు తెలుస్తోంది. సచివాలయాల్లో మార్పులు చేస్తున్నట్లు చెబుతున్నా, ఆచరణలో మాత్రం జరగడం లేదు.

బిల్లుల కోసం పడిగాపులు

అంగన్‌వాడీకేంద్రాల ఖర్చుల బిల్లులను సైతం ప్రభుత్వం సకాలంలో విడుదల చేయకపోవడంతో ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అద్దె కేంద్రాల్లో నడిచే అంగన్‌వాడీ సెంటర్లకు మున్సిపాలిటీల్లో రూ.నాలుగు వేలు, పట్టణాల్లో రూ.ఆరు వేలు, గ్రామాల్లో రూ.రెండు వేలు ప్రభుత్వం చెల్లించాల్సి ఉంది. గడిచిన ఐదునెలలుగా కేంద్రాల అద్దెలకు సంబంధించిన బకాయిలు ఇవ్వడం లేదు. దీంతో ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కరెంటు బిల్లుల బకాయిలు రెండేళ్లుగా ఇవ్వడం లేదు. కూరగాయలు, వంటగ్యాస్, రవాణా బకాయిలు వంటివి నాలుగు నెలలుగా ఇవ్వడం లేదు. దీంతో అంగన్‌వాడీ ఉద్యోగులు సొంత సొమ్ములు ఖర్చుచేయలేక నానా అవస్థలు పడుతున్నారు. ఇక గర్భిణులకు, బాలింతలకు సంబంధించిన వివరాలను ఫోన్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంది. ఫోన్లు పనిచేయక, చీటికీమాటికీ వెర్షన్లు మార్చడంతో ఉద్యోగులు నలిగిపోతున్నారు. ఫోన్ సమస్యలను ఏఒక్కరూ పట్టించుకోవడం లేదు. ముఖ్యంగా జిల్లాల విభజనతో కొన్ని అంగన్‌వాడీ కేంద్రాలను వేరే ప్రాజెక్టులో విలీనం చేశారు. అందులో భాగంగానే పోలవరం మండలానికి సంబంధించిన 78 కేంద్రాలను కొయ్యలగూడెం ప్రాజెక్టులో కలిపారు. వీలినమైన కేంద్రాల వివరాలు ప్రాజెక్టుకు చేరలేదంటూ బిల్లులు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారు. ఇలా అనేక సమస్యలతో అంగన్‌వాడీ సిబ్బంది ఆర్థికంగా నలిగిపోతున్నారు. ప్రభుత్వం స్పందించి తమ సమస్యలను పరిష్కరించి న్యాయం చేయాలని అంగన్‌వాడీలు ముక్తకంఠంతో కోరుతున్నారు.

వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ ప్రశాంతి

జగనన్న ఆరోగ్య సురక్షకు ఏర్పాట్లు చేయాలి

జిల్లా కలెక్టర్ ప్రశాంతి

ప్రజాశక్తి – భీమవరం

జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపుల నిర్వహణకు ఏర్పాట్లు పగడ్బందీగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి సంబంధిత అధికారులను ఆదేశించారు. తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి బుధవారం ముఖ్యమంత్రి జగన్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై సమీక్షించారు. భీమవరం కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి, డిఎంహెచ్ఒ డి.మహేశ్వరరావు, డిఎల్‌డిఒ కెసిహెచ్ అప్పారావు, డిఇఒ ఆర్.వెంకటరమణ, ఇన్‌ఛార్జి డిసిహెచ్ ఎస్‌పి.సూర్యనారాయణ పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ సంబంధిత అధికారులతో మాట్లాడారు. జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులు ప్రారంభం కంటే ముందు మూడు దశల్లో కార్యక్రమాలు చేపట్టాలన్నారు. తొలిదశలో గృహసారథులు, స్థానిక ప్రజాప్రతినిధులు ఇంటింటా ప్రచారం, రెండో దశలో ఎఎన్ఎం, సిహెచ్ఒలు ఇంటింటికీ వెళ్లి వివరాలు నమోదు చేయాలన్నారు. మూడో దశలో క్యాంపులు ప్రయోజనాలను వివరించడం, నాలుగో దశలో క్యాంపులు నిర్వహించడం చేయాల్సి ఉందన్నారు. ఈనెల 25న జిల్లాలో పట్టణ ప్రాంతంలో ఒకటి, గ్రామీణ ప్రాంతంలో ఒకటి మొత్తం రెండు పైలట్ క్యాంపులను నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. క్యాంపులకు అవసరమైన భవనాలను ముందుగా గుర్తించాలన్నారు. జనరల్ కన్సల్టెన్సీ, చిల్డ్రన్ కన్సల్టెన్సీ, గైనిక్ కన్సల్టెన్సీ, టెలి కన్సల్టెన్సీ అనే నాలుగు విభాగాలను ఏర్పాటు చేయాలన్నారు. మున్సిపల్ కమిషనర్లు, ఎంపిడిఒలు క్యాంపుల ఏర్పాటు బాధ్యతలను తీసుకోవాలన్నారు. తాగునీటి ఏర్పాటుతోపాటు, క్యాంపునకు హాజరై పరీక్ష చేయించుకునే వారికి భోజనం ఏర్పాటు చేయాలని సూచించారు. డిపిఒ జివికె మల్లికార్జునరావు, ఐసిడిఎస్ పీడీ బి.సుజాతారాణి, తాడేపల్లిగూడెం, పాలకొల్లు నరసాపురం, భీమవరం, తణుకు మున్సిపల్ కమిషనర్లు, అధికారులు పాల్గొన్నారు.

కొనసాగిన టిడిపి రిలే నిరాహార దీక్షలు

మొగల్తూరులో కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలుపుతున్న టిడిపి నేతలు

ప్రజాశక్తి – ఆచంట

చంద్రబాబు నాయుడు అరెస్టుకు నిరసనగా ఆచంటలో మాజీ మంత్రి పితాని సత్యనారాయణ ఆధ్వర్యంలో ఆయన కుమారుడు పితాని వెంకట్ సారధ్యంలో టిడిపి నాయకులు బుధవారం రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ముందుగా ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాల లేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో పితాని వెంకట్ మాట్లాడారు. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాల్సిన ప్రభుత్వమే ప్రాథమిక హక్కులకు భంగం కలిగిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. చంద్రబాబు అరెస్టు ప్రజాస్వామ్యానికి మాయని మచ్చని అన్నారు. జగన్ అధికారాన్ని అడ్డుపెట్టుకొని రాష్ట్రంలో అరాచక సృష్టిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏదేమైనా చివరికి ధర్మమే గెలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి ఉప్పలపాటి సురేష్‌బాబు, ఎంపిపి దిగమర్తి సూర్యకుమారి, మండల అధ్యక్షులు కేతా మీరయ్య, నాయకులు పాల్గొన్నారు.

భీమవరం రూరల్ : చంద్రబాబు అక్రమ అరెస్టుకు వ్యతిరేకంగా టిడిపి జిల్లా అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలకు జనసేన నాయకులు బుధవారం సంఘీభావం తెలిపారు. చంద్రబాబు జైలులో ఉన్నందున రాష్ట్ర కోశాధికారి మెంటే పార్థసారధి తన పుట్టినరోజు మానుకొని నిరాహార దీక్షలో పాల్గొని మాట్లాడారు. జగన్‌కి దమ్ము ధైర్యం ఉంటే ప్రజాక్షేత్రంలోకి రావాలన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు కనకరాజు సూరి, చెనమల్ల చంద్రశేఖర్, సుంకర రవి, మోకా శ్రీనివాస్, మాగాపు ప్రసాద్, రామాయణం, శ్రీనివాస్, దారపురెడ్డి త్రివిక్రమ్ పాల్గొన్నారు.

పాలకొల్లు : చంద్రబాబు అక్రమ అరెస్టును నిరసిస్తూ గాంధీ బొమ్మల సెంటర్లో ఎంఎల్ఏ నిమ్మల రామానాయుడు, మాజీ ఎంఎల్సీ అంగర రామ్మోహన్, మాజీ మంత్రి పీతల సుజాత టిడిపి శ్రేణులతో కలిసి బాబుతో రిలే నిరాహార దీక్షలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఏ మాట్లాడుతూ చంద్రబాబు అక్రమ కేసుల నుండి బయటకొచ్చేంత వరకూ టిడిపి శ్రేణులంతా అండగా తోడుగా ఉంటాయన్నారు.

చంద్రబాబును అరెస్ట్ చేసిన విధానం సరికాదని ఎంఎల్ఏ నిమ్మల రామానాయుడు చేస్తున్న పోరాటానికి యలమంచిలి సిపిఎం నేతలు మద్దతు తెలిపారు. ఈ మేరకు బుధవారం పాలకొల్లులో దీక్ష వద్దకు వచ్చి ఎంఎల్ఏ నిమ్మలకు సంఘీభావం తెలిపారు. జగన్ ప్రభుత్వం అక్రమ అరెస్టులు, గృహ నిర్బంధాలు చేసి ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని యలమంచిలి మండల కార్యదర్శి కానేటి బాలరాజు చెప్పారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నేతలు బాతిరెడ్డి జార్జి, గొల్ల ఏడుకొండల శ్రీనివాస్, మాసవరపు సుబ్బారావు, వడ్డికాసులు, తెన్నేటి స్టాలిన్, పల్లేరు అనిల్ పాల్గొన్నారు.

నరసాపురం టౌన్ : చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్ట్ నిరసనగా పార్టీ కార్యాలయం నాయకులు, కార్యకర్తలు, నియోజక వర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు ఆధ్వర్యంలో రెండో రోజు రిలే నిరాహార దీక్షలు కొనసాగాయి. ఈ సందర్భంగా రామరాజు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు జెక్కం శ్రీమన్నారాయణ, మండల అధ్యక్షుడు వాతడి.ఉమామహేశ్వర రావు, నాగిడి రాంబాబు పాల్గొన్నారు.

ఉండి : ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి నియంతపాలనకు చరమగీతం పాడాలని ఎంఎల్ఏ మంతెన రామరాజు అన్నారు. స్థానిక రిజిస్ట్రార్ ఆఫీస్ వద్ద ఉన్న పార్టీ కార్యాలయంలో మంతెన రామరాజు అధ్యక్షతన రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎంఎల్ఏ రామరాజు మాట్లాడుతూ తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు అధైర్యపడకుండా ధైర్యంగా పార్టీకి అండగా ఉండాలన్నారు. ఆకివీడు మండల నాయకులు మంతెన రామరాజుకు నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింపచేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు బొల్లం వెంకట్రావు, బచ్చు సరళాదేవి, గంధం ఉమా సత్యనారాయణ పాల్గొన్నారు.

మొగల్తూరు : చంద్రబాబు నాయుడు అరెస్టుకు నిరసనగా ముత్యాలపల్లిలోని టిడిపి నాయకులు కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు నేతలు మాట్లాడారు. ప్రభుత్వం కక్షపూరితంగా చంద్రబాబు నాయుడును నిర్బంధించారని విమర్శించారు. కార్యక్రమంలో నాగిడి రాంబాబు, బంధన నరసింహస్వామి, కొల్లాటి బాలకృష్ణ, దొంగ శ్రీను పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం : చంద్రబాబు నాయుడు అరెస్టు కేవలం కక్ష సాధింపు చర్య అని టిడిపి తాడేపల్లిగూడెం నియోజకవర్గ ఇన్‌ఛార్జి వలవల బాబ్జి అన్నారు. టిడిపి ఆధ్వర్యంలో గొర్రెల సూరన్న కాంప్లెక్స్‌లో బుధవారం రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ దీక్షలను టిడిపి అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి మల్లికార్జున్‌రావు (బాబ్జి) ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ దీక్షలో టిడిపి మండల అధ్యక్షులు పరిమి రవికుమార్, పెంటపాడు మండల అధ్యక్షులు ఇలపర్తి వెంకట్రావు, డిసిసిబి మాజీ డైరెక్టర్ దాసరి అప్పన్న, నేతలు పాల్గొన్నారు.

దీక్షలకు సిపిఎం సంఘీభావం

సిపిఎం జిల్లా నాయకులు చింతకాయల బాబూరావు, ఎఐటియుసి నాయకులు డి.సోమసుందర్ దీక్షలో పాల్గొన్న వారికి సంఘీభావం తెలిపారు. చంద్రబాబుకు బెయిల్ మంజూరు చేయాలని కోరారు.

తాడేపల్లిగూడెం : దీక్షలకు సంఘీభావం తెలుపుతున్న సిపిఎం నేత బాబూరావు

పింఛన్ల పంపిణీలో దళిత సర్పంచికి అవమానం

సచివాలయం వద్ద గ్రామస్తులతో ఆందోళన

ప్రజాశక్తి – కాళ్ల

కాళ్లలో కొత్త పింఛన్ల పంపిణీలో గ్రామ సర్పంచికి అవమానం జరిగింది. కాళ్లలో 25 కొత్త పింఛన్లు బుధవారం పంపిణీ చేశారు. అయితే గ్రామ సర్పంచి బందా విజయకు ఆహ్వానం అందలేదు. పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి దళిత సర్పంచిను ఆహ్వానించ కపోవడం, ఎంపిటిసి, వైసిపి నాయకులు పింఛన్లు పంపిణీ చేయడం సరికాదని సర్పంచి బంధా విజయ గ్రామస్తులతో కలిసి ఆందోళన చేశారు. ఈ కార్యక్రమానికి సర్పంచిని ఆహ్వానించకపోవడం సరికాదన్నారు. గ్రామంలో జరిగిన కార్యక్రమానికి సర్పంచిని పిలవరా అని ప్రశ్నించారు. దళిత సర్పంచి అని పక్కన పెట్టినప్పుడు పింఛన్ల పంపిణీ ప్రజలకు ఎలా చేరుతుందని సర్పంచి ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం ఇంచార్జి గ్రామ కార్యదర్శి పద్మావతి క్షమాపణతో ఆందోళన ముగిసింది. ప్రోటోకాల్ విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని సర్పంచి విజయ తెలిపారు.

సచివాలయం వద్ద ఆందోళన చేస్తున్న గ్రామ సర్పంచి విజయ

ఎంపిడిఒ జ్యోతికి వినతిపత్రం అందజేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు

ఫీల్డ్ అసిస్టెంట్లకు కనీస వేతనం ఇవ్వాలని వినతి

ప్రజాశక్తి – వీరవాసరం

ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బుధవారం ఎపి గ్రామీణ ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ల యూనియన్ ఆధ్వర్యంలో ఎంపిడిఒ జ్యోతికి బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఫీల్డు అసిస్టెంట్లు మాట్లాడారు. గత పదిహేడు సంవత్సరాల నుంచి ఉద్యోగాన్నే నమ్ముకుని ఈ పథకం ముందంజలో ఉండటానికి కృషి చేస్తున్నామని తెలిపారు. కూలీలకు పనులు, పని దినాలు ఎక్కువగా కల్పించడంలో క్షేత్ర స్థాయిలో ఫీల్డ్ అసిస్టెంట్ల పని తీరు, కృషిని ప్రభుత్వం గుర్తించాలన్నారు. పని ప్రాంతాల్లో కూలీల ఫొటోలు అప్‌లోడ్ చేయడంలో ఉన్న సాంకేతిక ఇబ్బందుల రీత్యా కూలీల హాజరు శాతం తగ్గిపోవడం వల్ల ఫీల్డ్ అసిస్టెంట్లు నిర్దేశించిన పని దినాలు పూర్తిచేయలేనట్లుగా చూపించడం వల్ల దాని ప్రభావం ఫీల్డ్ అసిస్టెంట్లపై పడటంతో డీ గ్రేడ్ అవుతున్నామన్నారు. మ్యాన్‌డేస్ టార్గెట్ విధానాన్ని రద్దు చేయాలని కోరారు. సీనియర్ మేట్, ఫీల్డ్ అసిస్టెంట్ అనే తారతమ్యం లేకుండా అందరిని ఫీల్డ్ అసిస్టెంట్లుగా పరిగణించాలన్నారు. అర్హత, అనుభవం కలిగిన వారికి ప్రమోషన్ కల్పించాలన్నారు. మున్సిపాల్టీ పరిధిలోకి విలీనమైన గ్రామ పంచాయతీల్లో ఫీల్డ్ అసిస్టెంట్లను యథావిధిగా కొనసాగించాలన్నారు. క్యాష్‌లెస్ హెల్త్ కార్డు సౌకర్యం కల్పించాలని, ప్రమాదవశాత్తూ మరణిస్తే రూ.పది లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో నక్కెళ్ల సత్యబాలకృష్ణ, మల్లుల లక్ష్మీ, జి.పుష్పారావు, బి.వరలక్ష్మి పాల్గొన్నారు.

ఎంఎల్ఏ రోడ్డుపై నడవకూడదా!

అడ్డుకున్న సిఐతో ఎంఎల్ఏ నిమ్మల వాగ్వివాదం

ప్రజాశక్తి – పాలకొల్లు

చంద్రబాబు అక్రమ అరెస్ట్‌కు నిరసనగా పట్టణంలో చేపట్టిన రిలే దీక్షలను పోలీసులు బుధవారం అడ్డుకునే ప్రయత్నం చేశారు. దీంతో వాగ్వివాదం జరిగింది. దీక్షలు చేయడానికి ఇంటి నుంచి బయలుదేరిన ఎంఎల్ఏ నిమ్మల రామానాయుడును పట్టణ ఎస్ఐ బాదం (శ్రీనివాస్ అడ్డుకోగా డోన్ట్ టచ్ మి అంటూ ఎంఎల్ఏ ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం నిమ్మల నడిచి గాంధీ బొమ్మ సెంటర్‌కు వెళుతుండగా పోలీస్ స్టేషన్ వద్ద పట్టణ సిఐ డి.రాంబాబు అడ్డుకున్నారు. ఎంఎల్ఏ రోడ్డు మీద నడిచే హక్కు లేదా అంటూ ప్రశ్నించారు. తన జోలికి వస్తే ప్రయివేటు కేసు వేసి హైకోర్టుకు వెళతానని హెచ్చరించారు. నరసాపురం డిఎస్‌పి అడ్డుకోగా ఇదే సమాధానం ఎంఎల్ఏ చెప్పారు. తిరిగి గాంధీ బొమ్మ సెంటర్ వద్ద కూడా దీక్షలు చేయకుండా పోలీసులు ఎంఎల్ఏను అడ్డుకున్నారు. చివరకు దాసరి విగ్రహం వద్ద దీక్షలు చేసుకునేందుకు పోలీసులు అంగీకరించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఏ మాట్లాడారు. పాలకొల్లులో శాంతియుతంగా జరుపుకునే నిరసనను కూడా అడ్డగోలుగా ఈ ప్రభుత్వం అడ్డుకుంటోందని చెప్పారు. వైసిపి నాయకులు నరసరావుపేటలో బాణాసంచా కాల్చి పుట్టినరోజు వేడుకలు చేసుకున్నారని, టిడిపి నేతలు రోడ్డు మీద తిరగడానికి ఒప్పుకోవడం లేదని చెప్పారు. రేపు నేను హైకోర్టులో రిట్ వేస్తాను అని హెచ్చరించారు.

ఎంఎల్ఏ నిమ్మలను అడ్డుకుంటున్న పోలీసులు

మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలిస్తున్న కేంద్ర బృందం సభ్యులు

పెన్నాడ పాఠశాలలో కేంద్ర బృందం పరిశీలన

ప్రజాశక్తి – పాలకోడేరు

పెన్నాడ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను జాతీయ ఆహార భద్రతా చట్ట పర్యవేక్షకులు డాక్టర్ ఉపేంద్రసింగ్, న్యూ ఢిల్లీ బృందం మధ్యాహ్న భోజన పథకం నిర్వహణను పరిశీలించారు. రోజువారి మెనూ పరిశీలించడమే కాకుండా బియ్యం,గుడ్లు, చిక్కిలు, రాగి పిండి నాణ్యతను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి భోజన పదార్థాల గురించి అడిగి తెలుసుకున్నారు. వంట సహాయకులు గ్యాస్ సబ్సిడీ ధర ఇవ్వాలని, గౌరవ వేతనం పెంచాలని, వంట ఛార్జీలు పెంచాలని నోడల్ అధికారిని కోరారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన, పాఠశాల పారిశుధ్య జిల్లా సమన్వయకర్తలు కె.కృష్ణారావు, జి.చిన్నయ్య, ప్రధానోపాధ్యాయుడు అబ్దుల్ అమీర్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చంద్రబాబుది ముగిసిన అధ్యాయం

డిప్యూటీ సిఎం కొట్టు విమర్శ సత్యనారాయణ

ప్రజాశక్తి – తాడేపల్లిగూడెం

చంద్రబాబుది ముగిసిన అధ్యాయమని, 14 ఏళ్ళు ముఖ్యమంత్రిగా చేయడమే కాకుండా రాష్ట్ర చరిత్రలో అవినీతి కేసుల్లో అరెస్ట్ అయిన తొలి ముఖ్యమంత్రిగా చంద్రబాబు రికార్డ్ సృష్టించారని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ విమర్శించారు. తాడేపల్లిగూడెం క్యాంపు కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అవినీతి కేసుల్లో అరెస్ట్ అయిన మాజీ ముఖ్యమంత్రిగా చంద్రబాబు రాష్ట్ర ప్రతిష్టను అంతర్జాతీయంగా మంట గలిపారని విమర్శించారు. ముఖ్యమంత్రి అయిన తొమ్మిది నెలలకే ఎన్‌టి రామారావుకు వెన్నుపోటు పొడిచి పదవిని బలవంతంగా లాక్కుని చివరకు ఆయన మరణానికి చంద్రబాబు కారకుడయ్యాడన్నారు. 2014 జూన్ 16న ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన చంద్రబాబు మూడు నెలలు తిరగకుండానే రూ.371 కోట్లు స్కిల్స్ స్కాంకు పాల్పడ్డాడంటే ఎంత అధికార దాహంతో, ధన దాహంతో ఉన్నాడో అర్థం చేసుకోవచ్చన్నారు. జనం స్పందించకపోవడం బట్టి తెలుగుదేశం నాయకులు తమ భవిష్యత్తుపై అంతర్మథనంతో పునరాలోచన చేసుకుంటున్నారన్నారు. చంద్రబాబును లోపల వేస్తేనే స్పందించని జనం ఇక పార్టీకి ఏం ఓటు వేస్తారని టిడిపి నాయకులు అంతర్గతంగా చర్చించుకుంటున్నారన్నారు. అమరావతి రియల్ ఎస్టేట్ కుంభకోణంతో ప్రపంచంలోనే కుబేర రాజకీయ నాయకుడిగా చంద్రబాబు అవతరించాలనుకున్నాడని విమర్శించారు. చంద్రబాబుకే తన మద్దతు అని పవన్ కళ్యాణ్ ప్రకటించడం ద్వారా ఇక జీవితకాలం జనసేన పార్టీ చంద్రబాబుకు ఊడిగం చేయడానికి పెట్టినట్లు స్పష్టమైపోయిందన్నారు. ఇప్పటికైనా జనసైనికులు, వీర మహిళలు, పవన అభిమానులు ఆలోచించుకోవాలన్నారు. అవినీతి కేసులో అరెస్ట్ అయిన చంద్రబాబు ఇక చరిత్ర హీనుడిగా మిగిలిపోయాడన్నారు. సమావేశంలో మాజీ జెడ్‌పిటిసి ముప్పిడి సంపత్‌కుమార్, తాడేపల్లిగూడెం వైస్ ఎంపిపి కట్టా రంగబాబు, మండల యూత్ అధ్యక్షులు ములకల రాంబాబు పాల్గొన్నారు.



ప్రజాశక్తి వార్షికోత్సవ సంచికను ఆవిష్కరిస్తున్న డిఎస్‌పి మనోహరాచారి

ప్రజా సమస్యలు వెలికితీతలో ప్రజాశక్తిది కీలక పాత్ర

నరసాపురం డిఎస్‌పి మనోహరాచారి

పత్రిక 43వ వార్షికోత్సవ ప్రత్యేక సంచిక ఆవిష్కరణ

ప్రజాశక్తి – నరసాపురం టౌన్

ప్రజాస్వామ్యంలో పత్రికల పాత్ర కీలకమని, ప్రజా సమస్యలను వెలికి తీయడంలో 'ప్రజాశక్తి' కీలక భూమిక నిర్వహిస్తోందని నరసాపురం డిఎస్‌పి మనోహరాచారి చెప్పారు. బుధవారం నరసాపురం సబ్ డివిజన్ పోలీస్ కార్యాలయంలో ప్రజాశక్తి నరసాపురం డివిజన్ 43వ వార్షికోత్సవ ప్రత్యేక సంచికను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డిఎస్‌పి మాట్లాడుతూ ప్రస్తుతం ప్రజా సమస్యలు, సామాన్య ప్రజల కష్టాలను ప్రజాశక్తి దిన పత్రిక నిర్భయంగా వెలికి తీస్తోందని చెప్పారు. సామాన్య ప్రజల అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్న ప్రజాశక్తి టీంను ఆయన అభినందించారు. శాస్త్ర, సాంకేతిక రంగాలు అభివృద్ధి చెందుతున్నా నేర ప్రవృత్తి పెరుగుతోందని, తప్పు చేసిన వారికి శిక్ష తప్పదని తెలిపారు. యువత మంచిబాటలో పయనిం చాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎడివిటి జిల్లా ఇన్‌ఛార్జి పి.నారాయణరాజు, డివిజన్ ఇన్‌ఛార్జి కె.బాలాజీ నాయుడు, సర్కులేషన్ ఇన్‌ఛార్జి టి.పెద్ది రాజు విలేకరులు పిటి.వెంకటేశ్వరరావు, తెన్నేటి నాగరాజు, ఎన్.బాలాజీ, ఎన్.సుబ్బరాజు, బర్రి రాజ్‌కుమార్, వర్ధనపు శ్రీనివాస్, జి.బాలాజీ పాల్గొన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com



ఇఎపిసెట్‌లో ప్రగతి విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - తణుకు రూరల్

ఇఎపిసెట్-23 మెడికల్ విభాగంలో మరొక్కసారి తమ అధిఖ్యతను ప్రగతి జూనియర్ కాలేజీ నిరూపించుకుందని కాలేజీ డైరెక్టర్ ఎంఎస్‌ఆర్ ఆంజనేయులు(రాజా) తెలిపారు. వెటర్నరీ అడ్మిషన్లలో ఎన్‌టిఆర్ కాలేజీ ఆఫ్ వెటర్నరీ సైన్స్ గన్నవరంలో ఎస్‌పిఎస్‌డి.మహిత(655), ఎస్‌కె.మజాన్‌బి(1722), టి.జయ వెంకటలావణ్య(3202) అడ్మిషన్ సాధించారని తెలిపారు. ఇంతటి ఘన విజయాన్ని సాధించిన విద్యార్థినులకు, తల్లిదండ్రులకు, అధ్యాపకులకు అభినందనలు తెలిపారు.

15న మెగా జాబ్‌మేళా

ప్రజాశక్తి - తణుకు

స్థానిక చిట్టూరి ఇంద్రయ్య స్మారక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 15వ తేదీన శుక్రవారం ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ, కళాశాల ఉన్నత విద్య కమిషనరేట్ ఆధ్వర్యంలో మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.అనిల్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ జాబ్‌మేళాలో 25 కంపెనీలు పాల్గొంటున్నాయని, తణుకు ఎన్‌ఆర్‌సి పరిధిలోని 14 కళాశాలలో డిగ్రీ తృతీయ సంవత్సరం చదువుతున్న, డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులందరూ అర్హులేనని తెలిపారు. వివిధ కంపెనీలు నిర్వహించే ప్రాంగణ ఎంపికల్లో ఉద్యోగాలు పొందొచ్చని చెప్పారు. రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా విచ్చేసి జాబ్‌మేళాను ప్రారంభిస్తారన్నారు. కళాశాల ఉన్నత విద్య కమిషనర్ డాక్టర్ పోలా భాస్కర్ పాల్గొంటారని తెలిపారు.

తాడేపల్లిగూడెం ఎస్‌ఐగా సుధాకర్‌రెడ్డి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

తాడేపల్లిగూడెం పట్టణ ఎస్‌ఐగా బాధ్యతలు చేపట్టిన సుధాకర్ రెడ్డి మంత్రి కొట్టు సత్యనారాయణను బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ సుధాకర్‌రెడ్డిని మంత్రి అభినందించారు.

అర్హులందరికీ పింఛన్లు

ప్రజాశక్తి - పెనుమంట్ర

అర్హులందరికీ పెన్షన్ అందిస్తున్నామని ఓడూరు సర్పంచి బుర్రా రవికుమార్ అన్నారు. గ్రామంలో కొత్తగా మంజూరైన పింఛన్లను లబ్ధిదారులకు బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ గ్రామంలో 16 మందికి ఎంఎల్‌ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు సహకారంతో పింఛన్లు అందించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ సత్యనారాయణ, కన్వీనర్ సూరిబాబు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

పోడూరు : మండలంలోని జగన్నాధపురంలో కొత్తగా మంజూరైన పింఛన్లను పెన్షన్‌దారులకు సర్పంచి గుడాల శిరిష చంటి ఆధ్వర్యంలో బుధవారం అందించారు. ఈ సందర్భంగా సర్పంచి మాట్లాడుతూ అర్హులందరికీ పెన్షన్ అందిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో పి.పోలవరం సర్పంచి కుచ్చర్లపాటి పద్మనాభరాజు, శ్రీనివాస్, నరేష్, దిద్దే శ్రీను పాల్గొన్నారు.

ఆచంట : కొత్తగా మంజూరైన పెన్షన్లను బుధవారం పంపిణీ చేశారు. ఆచంటలో 120, ఆచంట వేమవరంలో 56, కొడమంచిలి పంచాయతీ పరిధిలో 30, పెనుమంచిలిలో 18 మంది లబ్ధిదారులకు ఆయా గ్రామాల సర్పంచులు కోట సరోజినీ వెంకటేశ్వరరావు, సుంకర సీతారామ్, జక్కంశెట్టి చంటి, గణేశుల శేషవాణి సుబ్బారావు పంపిణీ చేశారు.

మొగల్తూరు : అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని జెడ్‌పిటిసి సభ్యులు తిరుమణి బాబూజీ అన్నారు. మండలంలోని 17 గ్రామాలకు సంబంధించి నూతనంగా మంజూరైన పింఛన్లు బుధవారం పంపిణీ చేశారు. ఈ నెల ఒకటో తేదీన అందించిన 10,355 పింఛన్లు కాకుండా నూతనంగా మంజూరైన 513 పింఛన్లను ఆయా గ్రామాలకు సంబంధించిన సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, వైసిపి నాయకులు, పార్టీ గ్రామ అధ్యక్షులు అందించారు.

వికలాంగులకు వీల్‌చైర్లు అందజేత

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

స్థానిక త్రీ ఎఫ్ ఇండస్ట్రీ వారి త్రీఎఫ్ స్వాభిమాన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నలుగురు వికలాంగులకు బుధవారం ఉచితంగా వీల్ చైర్లు పంపిణీ చేసినట్లు అసిస్టెంట్ మేనేజర్ జి.శ్రీనివాస్ రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. త్రీ ఎఫ్ ఫ్యాక్టరీలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఫ్యాక్టరీ చుట్టుపక్కల గ్రామాలైన ప్రత్తిపాడు, రాచర్ల నుంచి పలువురు వికలాంగులు వచ్చారని తెలిపారు. ఫ్యాక్టరీ యజమానులు సుశీల్ గోయింకా, ఓం ప్రకాష్ గోయింకా, ప్రణవ్ గొయింకా, హెచ్‌ఆర్ జనరల్ మేనేజర్ జనార్ధన్, సిఎస్‌ఆర్ అసిస్టెంట్ మేనేజర్ శ్రీనివాస్‌రెడ్డి, వేముల శ్రీనివాస్, కో-ఆర్డినేటర్, అతిథులుగా విచ్చేసిన విదేశీయులు వికలాంగులకు వీల్ చైర్లు అందించినట్లు తెలిపారు.

చిన్నారికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - మొగల్తూరు

చిన్నారి నవ్యకు ప్రభుత్వ కళాశాల సిబ్బంది బుధవారం ఆర్థిక సహాయాన్ని అందించారు. మండలంలోని కెపి.పాలెం పంచాయతీ పరిధి పావిరాలమెరక చెందిన బిరజ రమేష్ కుమార్తె నవ్య మెదడు సంబంధిత వ్యాధితో విజయవాడలో చికిత్స పొందుతుంది. చిన్నారి చికిత్సకు స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ జెవి.నరసింహమూర్తి, అధ్యాపకులు, విద్యార్థులు రూ.పది వేలు సమకూర్చి ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు చింతపల్లి కృష్ణమోహన్, కృష్ణానందం, శ్రీనివాసరావు, ప్రసాద్, శ్రీనివాస్ బాబు, మంగతాయారు పాల్గొన్నారు.

200 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు

ప్రజాశక్తి - గణపవరం

గణపవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం అర్ధవరం జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులకు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా 200 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించినట్లు నేత్ర వైద్యులు ఐ.శ్రీనివాస్ చెప్పారు. వీరిలో 21 మందికి కళ్లజోళ్లు అవసరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్కూల్ హెచ్‌ఎం ప్రసన్న ఆంజనేయులు, సిహెచ్‌ఒ జాలాది విల్సన్‌బాబు, ఎంఎల్‌హెచ్‌పి ఎస్.దివ్యభారతి, ఎఎన్‌ఎం ఇ.లక్ష్మీకాంతమ్మ, హెల్త్ అసిస్టెంట్ బి.రవికుమార్, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

మండల స్థాయి పోటీలకు క్రీడాకారుల ఎంపిక

ప్రజాశక్తి - పెనుమంట్ర

మార్టేరు ఎస్‌విజిహెచ్ హైస్కూల్ ప్రాంగణంలో అండర్-14, అండర్-17 స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా మండల స్థాయిలో బుధవారం యోగా, ఖోకో, కబడ్డీ క్రీడాంశాల్లో ఎంపికలు జరిగాయి. హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు సిహెచ్.చిన్నసూర్యనారాయణరెడ్డి ఎంఇఒ ఉంగరాల నాగేశ్వరరావు ఎంపికలు ప్రారంభించారు. ఈ ఎంపికలో మండలానికి చెందిన పీడీలు, పిఇటిలు పాల్గొన్నారు. మండలంలోని ఆయా హైస్కూలులో విద్యార్థులు, వివిధ పాఠశాలలకు చెందిన పీడీలు సుజాత, కెనడి ఊహ, కృష్ణ శ్రీనివాసరెడ్డి ఎంతో పారదర్శంగా నిర్వహించినట్లు మండల కో-ఆర్డినేటర్ పీడీ కృష్ణారెడ్డి తెలిపారు. అంతేకాకుండా నెగ్గిపూడి గురుకుల పాఠశాల పీడీ పెచ్చెట్టి దుర్గారావు పాల్గొన్నారు.

మట్టి విగ్రహాలను వినియోగించాలి

భీమవరం రూరల్ : ఈ నెల 18వ తేదీన వినాయక చవితి పండుగను ప్రజలందరూ సాంప్రదాయంగా జరుపుకోవాలని ఇన్‌టౌన్ సిఐ అడబాల శ్రీనివాస్ కోరారు. స్థానిక వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో బుధవారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో వినాయక చవితి విగ్రహాలు నిలబెట్టే కమిటీ సభ్యులు పోలీస్ మున్సిపాలిటీ అనుమతులు తీసుకోవాలని తెలిపారు. అంతే కాకుండా ఊరేగింపుల్లో ఎక్కువగా యువత పాల్గొంటారని, ఆ సమయంలో మద్యం తాగకూడదని చెప్పారు. విగ్రహం నిలబెట్టిన మండపంలో నిరంతరం ఇద్దరు, ముగ్గురు కమిటీ సభ్యులు ఉండాలన్నారు. మట్టి విగ్రహాలను వినియోగించాలని కోరారు. పండుగ సందర్భంగా స్థానిక ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్ వినాయక విగ్రహాలు పంపిణీ కార్యక్రమం చేపట్టనున్నారని తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్కులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్కులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

ఉండి ఎఎంసి ఉపాధ్యక్షులుగా నరేంద్రకుమార్

వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పివిఎల్ అభినందన

నమ్మకాన్ని నిలబెట్టుకుంటా : నరేంద్రకుమార్


నరేంద్రకుమార్‌ను అభినందిస్తున్న పివిఎల్

ప్రజాశక్తి - పాలకోడేరు

నీతి.. నిజాయితీతో పాటు నిబద్ధతకు నిదర్శనం గొల్లలకోడేరు గ్రామానికి చెందిన వైసిపి గ్రామ కన్వీనర్ చేకూరి రాజానరేంద్రకుమార్ అని ప్రతి నోటా ఇదే మాట వినిపిస్తూ ఉంటుంది. స్వార్థం లేకుండా ఏమి ఆశించకుండా ఎదుటివాళ్లకు సహాయపడి అండగా నిలబడే మనసున్న మారాజు నరేంద్రకుమార్ అని గ్రామస్తులు చెబుతుంటారు. వైసిపిలో నరేంద్రకుమార్ సుదీర్ఘ కాలం పాటు పార్టీకి అనేక సేవలందిస్తూ పార్టీ అభివృద్ధికి పాటుపడుతూనే నాయకులు, కార్యకర్తలను సమన్వయ పరుస్తూ పార్టీ కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తూ ముందుకు సాగుతున్నారు. ఈ నేపథ్యంలో అధిష్టానం నరేంద్రకుమార్ సేవలను గుర్తించి నిబద్ధతకు పట్టం కట్టింది. వైసిపి ఉండి నియోజకవర్గ ఇన్‌ఛార్జి, డిసిసిబి ఛైర్మన్ పివిఎల్.నరసింహరాజు నరేంద్రకుమార్‌కు ఉండి ఎఎంసి ఉపాధ్యక్షుని పదవిని కట్టబెట్టారు. ఈ పదవిని ఎంతోమంది ఆశించినప్పటికీ మరెన్నో పేర్లు తెరపైకి వచ్చినప్పటికీ పివిఎల్ నరసింహరాజు మాత్రం వైసిపి పట్ల విధేయత, నిబద్ధత కలిగిన నరేంద్రకుమార్‌కు కేటాయించారు. వివాద రహితుడైన నరేంద్రకుమార్‌ను ఎఎంసి ఉపాధ్యక్షునిగా నియమించడం పట్ల అంత హర్షం వ్యక్తమవుతుంది. దీనిలో భాగంగా ఎఎంసి ఉపాధ్యక్షునిగా బాధ్యతలు చేపట్టిన నరేంద్రకుమార్ స్థానిక పార్టీ కార్యాలయంలో పివిఎల్ నరసింహరాజును మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా పివిఎల్ నరేంద్రకుమార్‌కు స్వీట్ తినిపించి శుభాకాంక్షలు తెలియజేసి అభినందించారు. పార్టీలో కష్టపడుతున్న వారికి గుర్తింపు ఎప్పుడూ ఉంటుందని, దీనికి నరేంద్రకుమారే నిదర్శనమని పివిఎల్ చెప్పారు. నరేంద్రకుమార్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి పదవి కేటాయించిన పివిఎల్‌కు రుణపడి ఉన్నానన్నారు. తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని చెప్పారు. పదవి తనపై మరింత బాధ్యత పెంచిందని అటు పార్టీకి ఇటు ఎఎంసికి, రైతుల అభ్యున్నతికి కృషి చేస్తానని చెప్పారు.

విద్యార్థులు నైపుణ్యాన్ని మెరుగుపర్చుకోవాలి : కలెక్టర్

ప్రజాశక్తి - భీమవరం రూరల్

విద్యార్థి దశ నుంచే చదువుతో పాటు నైపుణ్యాలను కూడా మెరుగు పరుచుకుంటే ఉన్నత స్థానాలను అందిపుచ్చుకోగలరని కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. స్థానిక డిఎన్‌ఆర్ కళాశాలలో బుధవారం నిర్వహించిన మెగా జాబ్‌మేళాను కలెక్టర్ పి.ప్రశాంతి సందర్శించి, కళాశాల ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు వారి చదువుతోపాటు ఎప్పటికప్పుడు సాఫ్ట్ స్కిల్స్ లేదా ప్రొఫెషనల్ స్కిల్స్‌లో నైపుణ్యాని పొందాల్సిన అవసరం ప్రతి ఒక్కరికి ఉందన్నారు. ఇంత భారీస్థాయిలో జాబ్‌మేళాను ఏర్పాటు చేసిన డిఎన్‌ఆర్ కళాశాల యాజమాన్యాన్ని ఆమె అభినందించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బిఎస్.శాంతకుమారి మాట్లాడుతూ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ సహకారంతో జాబ్‌మేళాను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. డిఎన్‌ఆర్ కళాశాల పాలకవర్గ అధ్యక్షులు గోకరాజు వెంకట నరసింహరాజు, పాలకవర్గ సెక్రటరీ, కరస్పాండెంట్ గాదిరాజు సత్యనారాయణరాజు, కళాశాల పాలకవర్గ ఉపాధ్యక్షులు జి.పాండురంగరాజు, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎ.కృష్ణారెడ్డి మాట్లాడారు. పాలకవర్గ సంయుక్త కార్యదర్శి కె.రామకృష్ణంరాజు, ట్రెజరర్ జివిఎస్‌ఆర్.నారాయణ, అసిస్టెంట్ సెక్రటరీ కె.శివరామరాజు, పాలకవర్గ సభ్యులు ఎన్.రామలింగరాజు, దత్తాత్రేయవర్మ, పి.రామకృష్ణంరాజు పాల్గొన్నారు.

రైతుల అభ్యున్నతికి కృషి

ఎఎంసి ఛైర్మన్ షేక్ రసూల్‌బేబి

ప్రజాశక్తి - ఆకివీడు

రైతుల సమస్యలను బోర్డు సభ్యులు రైతుల వద్దకే వెళ్లి తెలుసుకోవాలని నిర్ణయించినట్లు ఎఎంసి ఛైర్మన్ రసూల్‌బేబి తెలిపారు. ఆకివీడు వ్యవసాయ మార్కెట్ నూతన కమిటీ తొలి సమావేశం బుధవారం స్థానిక యార్డు కార్యాలయంలో ఛైర్మన్ రసూల్‌బేబి అధ్యక్షతన నిర్వహించారు. అభివృద్ధి ఒకే ఒక్క అంశం అజెండాగా తొలి సమావేశం నిర్వహించారు. యార్డు వల్ల రైతులకు కావాల్సిన సహాయ సహకారాలను వారి వద్దకు వెళ్లి తెలుసుకుని అందించేందుకు ప్రయత్నించాలని, అందుకోసం అందరూ కలిసి కృషి చేద్దామని ఆమె బోర్డు సభ్యులకు సూచించారు. అనంతరం యార్డ్ ప్రాంగణంలో ఉన్న పల్ల ప్రాంతాన్ని పూడ్చి, పాడైపోయిన గిడ్డంగులను మరమ్మతు చేసి రైతులకు అందుబాటులోకి తీసుకురావాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో వైస్ ఛైర్మన్ ఆనందరావు సభ్యులు పాల్గొన్నారు.

అనారోగ్య చిన్నారికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - పాలకొల్లు

మొగల్తూరు మండలంలోని కెపి.పాలెం గ్రామానికి చెందిన బి.రమేష్ దంపతుల కుమార్తె నయ సంకీర్తన బ్రెయిన్ ట్యూమర్ వ్యాధితో బాధపడుతుంది. చిన్నారి పరిస్థితిని వసుధా ఫౌండేషన్ ఛైర్మన్ మంతెన వెంకటరామరాజు తెలుసుకుని రూ.పది వేలు చెక్కు పంపించగా పాలకొల్లు వసుధ ఫౌండేషన్ కన్వీనర్ పి.బుద్ధరాజు చిన్నారి పెదనాన్న రాంబాబుకు అందించారు. వారు వసుధ ఫౌండేషన్ ఛైర్మన్ మంతెన వెంకటరామరాజుకు కృతజ్ఞతలు తెలిపారు.

'ఆదిత్య'లో ప్రోగ్రామర్స్ డే

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాలలో బుధవారం అంతర్జాతీయ ప్రోగ్రామర్స్ డే నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపల్ పి.లక్ష్మీసరోజ తెలిపారు. ఈ కార్యక్రమానికి స్థానిక మహిళా కళాశాల ప్రధాన అధ్యాపకులు ఎన్.గణపతి ముఖ్య అతిథిగా విచ్చేసి, ప్రస్తుతం ఉన్న ప్రోగ్రామింగ్, ప్రోగ్రామర్స్ ఆవశ్యకతను వివరించారు. కంప్యూటర్ హార్డ్‌వేర్‌కు సంబంధించిన విభాగాలు, రోబో ప్రదర్శన నిర్వహించారు.

హెల్మెట్ ధరించాలి

ప్రజాశక్తి - ఉండి

హెల్మెట్ ధరించండి.. ప్రాణాలు నిలుపుకోండి అంటూ ఉండి గ్రామంలోని గీతాంజలి ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు బుధవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ రాజు మాట్లాడుతూ ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించడం వల్ల ప్రమాదంలో ప్రాణాపాయం నుంచి తప్పించుకోవచ్చన్నారు. కొంతమంది వాహనదారులను రహదారిపై నిలుపుదల చేసి చిన్నారులతో చాక్లెట్లు ఇప్పించి హెల్మెట్ అవసరాన్ని వాహనదారులకు వివరించారు.

'రాష్ట్రంలో విధ్వంసాలు సృష్టిస్తున్న టిడిపి'

ప్రజాశక్తి - ఆచంట

స్కిల్ డెవలప్‌మెంట్ స్కాం లో రిమాండ్‌కు వెళ్లిన చంద్రబాబు నాయుడును కాపాడుకోవడానికి టిడిపి శ్రేణులు విధ్వంసకర పరిస్థితులు సృష్టిస్తున్నాయని వైసిపి రాష్ట్ర కార్యదర్శి వైట్ల కిషోర్‌కుమార్ అన్నారు. బుధవారం ఆచంటలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇన్నాళ్లు వ్యవస్థలను మేనేజ్ చేసి, చట్టాల్లో ఉన్న లొసుగులను, సాంకేతిక అంశాలను ఉపయోగించుకుని తప్పించుకున్నారున్నారు. చట్టానికి అందరూ సమానమేనన్నారు. నిందితులు ఎంతటివారైనా శిక్ష అనుభవించక తప్పదని న్యాయవ్యవస్థ నిరూపించిందన్నారు. ఈ సమావేశంలో ఎంపిటిసి సభ్యులు జ్యోతి రామానుజం, తప్పెట్ల విజయకుమారి వెంకట్రావు, మనవర్తి విజయ్‌కుమార్, జిల్లా యువజన కార్యదర్శి దేవిరెడ్డి రాంబాబు, లీగల్ సెల్ అధ్యక్షులు వస్కా ఉమేష్, మనవర్తి శుభాకరరావు, రామలింగేశ్వరరావు పాల్గొన్నారు.

మేలైన వ్యవసాయ పద్ధతులు పాటించాలి

ప్రజాశక్తి - గణపవరం

రైతులు మేలైన వ్యవసాయ పద్ధతులు పాటించి పురుగు మందుల వాడకం తగ్గిస్తే నాణ్యమైన బియ్యాన్ని ఉత్పత్తి చేయవచ్చని జిల్లా వ్యవసాయ అధికారి వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని అప్పన్నపేటలో బుధవారం నిర్వహించిన పొలంబడి కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సహాయ సంచాలకులు పి.మురళీకృష్ణ మాట్లాడుతూ రైతులు వ్యవసాయ అధికారుల సలహాలు పాటించి అధిక దిగుబడులు సాధించాలని చెప్పారు. మండల వ్యవసాయ అధికారి వై.ప్రసాద్ మాట్లాడుతూ ప్రతి రైతు పంట నమోదు చేయించుకోవాలని, ఇ కెవైసి ప్రక్రియ పూర్తి చేయించుకోవాలని చెప్పారు. పశు వైద్యులు జ్యోతి మాట్లాడుతూ రైతులు తమ పశువులకు రైతు భరోసా కేంద్రాల వద్ద ఇన్సూరెన్స్ చేయించుకోవచ్చని చెప్పారు.

మొగల్తూరు : అన్నదాతలు యాజమాన్య పద్ధతుల పాటిస్తే పంట దిగుబడి పెరుగుతుందని వ్యవసాయ అధికారి అబ్దుల్ రహీం అన్నారు. శేరేపాలెం పంచాయతీ పరిధి నవుడూరువానిగరువులో బుధవారం సాయంత్రం పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడారు. ఎరువులు, పురుగు మందులు ఎంత మోతాదులో వాడాలో వివరించారు.

సంస్కృతి, సాంప్రదాయాలపై అవగాహన అవసరం

ప్రజాశక్తి - భీమవరం రూరల్

విద్యార్థి దశ నుంచి మన సంస్కృతి సాంప్రదాయాలపై అవగాహన కల్పించాలని, వినాయక చవితి సందర్భంగా మట్టి వినాయక విగ్రహాలు వినియోగించడం పర్యావరణ పరిరక్షణకు ఎంతో దోహద పడుతుందని జిల్లా రెవెన్యూ అధికారిణి కృష్ణవేణి అన్నారు. శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో బుధవారం అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణవేణి మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడాలని, తప్పకుండా విద్యార్థులు మట్టి విగ్రహాలే వినియోగించాలని సూచిం చారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ ప్రతి పాఠశాలలోను ఉపాధ్యాయులు మట్టి విగ్రహాలను తయారు చేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో చినరంగనిపాలెం హైస్కూల్ హెచ్‌ఎం గోపీనాథ్ పాల్గొన్నారు.

'జగనన్న ఆరోగ్య సురక్ష'ను వినియోగించుకోండి

ప్రజాశక్తి - కాళ్ల

జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డిసిసిబి ఛైర్మన్ పివిఎల్.నరసింహరాజు అన్నారు. కాళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద జగనన్న ఆరోగ్య సురక్ష అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. వైద్య సిబ్బందికి అవగాహన కల్పించారు. డిసిసిబి ఛైర్మన్ పివిఎల్.నరసింహరాజు మాట్లాడుతూ ఈ నెల 15వ తేదీ నుంచి గ్రామాల్లో ప్రతి ఇంటికి వెళ్లి సర్వే చేసి ప్రజల ఆరోగ్య సమస్యలను అడిగి తెలుసుకోవాలన్నారు. డాక్టర్ ఎం.గులాబ్‌రాజ్‌కుమార్ మాట్లాడుతూ దీర్ఘకాలిక వ్యాధులున్న వారి వివరాలు నమోదు చేసుకుని, 30వ తేదీ జరిగే వైద్య శిబిరాలకు పంపే విధంగా చూడాలన్నారు. ప్రభుత్వం ఉచితంగా వైద్యం అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు సోమేశ్వరరావు, ఎంపిపి శిరీష విశ్వనాథరాజు, గ్రామ సర్పంచి బందా విజయ, వైద్యాధికారి సరాబు సునీల్, వైద్య సిబ్బంది, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

పెనుమంట్ర : జగనన్న ఆరోగ్య సురక్ష ఈ నెల 30వ తేదీ నుంచి అక్టోబర్ 18 వరకు మండలంలోని గ్రామాల్లో నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ వి.పూర్ణబాబ్జి తెలిపారు. స్థానికంగా బుధవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఎంపిడిఒ వివరాలు తెలిపారు. ఈ నెల 30వ తేదీన నెగ్గిపూడిలో, అక్టోబర్ మూడో తేదీన ఆలమూరులో, నాలుగో తేదీన నత్తారామేశ్వరం, ఐదో తేదీన మార్టేరు-2లో, ఆరో తేదీన పెనుమంట్ర-2లో, ఏడో తేదీన జుత్తిగలో, తొమ్మిదో తేదీన నెలమూరులో, పదో తేదీన ఓడూరులో, 11వ తేదీన మల్లిపూడిలో, 12వ తేదీన వెలగలవారిపాలెంలో, 13వ తేదీన సోమరాజు ఇల్లింద్రపర్రులో, 16వ తేదీన సత్యవరంలో, 18వ తేదీన వెలగలేరు గ్రామాల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. వీటిలో పెనుమంట్ర సిహెచ్‌సి పరిధిలో టీం1లో వై.అనూష, టీం2లో కె.లావణ్య, ఆలమూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో టీం 1లో డాక్టర్ వి.అనిల్‌కుమార్, టీం2లో కె.ప్రదీప్‌కుమార్, మార్టేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో టీం1లో కె.కార్తీక్, టీం2లో డాక్టర్ ఎస్‌కె.ఛావిర్ అందుబాటులో ఉంటారని తెలిపారు.

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో పాటల పోటీలు

ప్రజాశక్తి - పాలకొల్లుయ రూరల్

రోటరీ యూత్ సర్వీస్ మంత్‌లో భాగంగా పాలకొల్లు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో పాలకొల్లు ఏలిమ్ స్కూల్లో ప్రభుత్వ, ప్రయివేట్ స్కూల్స్ విద్యార్థులకు బుధవారం పాటల పోటీలు నిర్వహించారు. 6,7 తరగతులు చదువుతున్న విద్యార్థులకు జూనియర్స్‌గా, 8, 9, 10 తరగతుల విద్యార్థులు సీనియర్లుగా పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన వారికి జూనియర్స్, సీనియర్స్ విభాగం నుంచి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు విద్యార్థులకు అందిస్తామని పాలకొల్లు రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ పెనుమాక రామ్మోహన్ తెలిపారు. పాటల పోటీలకు న్యాయనిర్ణేతగా కెఎపి.శర్మ వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సెక్రటరీ రావాడ సతీష్, ట్రెజరర్ ముత్యాల శ్రీవాత్సవ ప్రదీప్, మాజీ ప్రెసిడెంట్లు చందక రాము, రేపాక రత్నంరాజు, కటారి నాగేంద్ర, కానూరి ప్రభాకర్, పోతాబత్తుల సత్యనారాయణ పాల్గొన్నారు.

పాఠశాలలో తనిఖీలు

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

మండలంలోని లంకలకోడేరు ఉన్నత పాఠశాలను ఢిల్లీ కేంద్రం నుంచి వచ్చిన జాతీయ ఆహార భద్రత చట్టం ప్రజా పంపిణీ నిర్వహణ (ఎన్‌ఎఫ్‌ఎస్‌ఎ) వారు నోడల్ అధికారి డాక్టర్ ఉపేంద్రసింగ్ నాయకత్వంలో బుధవారం సందర్శించారు. మధ్యాహ్న భోజనం, బియ్యం, గుడ్లు, చిక్కీలు, రాగి పిండి, బెల్లం పొడి నిల్వలను, వాటి నాణ్యతలను పరిశీలించారు. మధ్యాహ్న భోజనం మెనూ, వంటల తయారీ విధానం, మంచినీటి వసతి, వంటశాల ప్రాంగణం పరిశీలించారు. వంట గ్యాస్‌ను సబ్సిడీ రేటుకు ఇప్పించాలని వంట చేస్తున్న ఏజెన్సీ వారు కోరారు. వంట తయారీకి విద్యార్థికి ఇచ్చే రుసుమును పెంచాలని, కనీస వేతనం పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజనం, పారిశుధ్య జిల్లా సమన్వయకర్తలు కె.కృష్ణారావు, జి.చిన్నయ్య, మండల విద్యాశాఖాధికారి గుమ్మల్ల వీరాస్వామి, ప్రధానోపాధ్యాయులు జిబిజె.ప్రసాద్‌రావు, సీనియర్ ఉపాధ్యాయులు జి.జనార్దన్‌రావు, వ్యాయామ ఉపాధ్యాయులు కె.ప్రకాష్‌రావు, సిఆర్‌పి రామకృష్ణ పాల్గొన్నారు.

ప్రకటన

శ్రీ కోరుప్రోలు సత్యనారాయణ, తండ్రి : వీరయ్య, ద్వారకా తిరుమల నివాసి, బిజినెస్, వారు ఇచ్చిన సంజాయిషీ మీద ఈ దిగువ ప్రకటన జారీచేయడమైనది.

నా Client శ్రీ కోరుప్రోలు సత్యనారాయణ గారు ది.03-01-2006వ తేదీన శ్రీ సిరిపురపు కందాళ వెంకట బలరామాచార్యులు మరియు వారి కుటుంబ సభ్యులు నుండి R.S.No.108/3, D.No.7-106 గల RCC భవంతిని కొనుగోలు చేసియున్నారు. నాటి నుండి ఆ ఆస్తి వారి సంపూర్ణ స్వాధీన హక్కు భ